నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ఎమ్మెల్యే శ్రీగణేష్



బస్తీ దవాఖానాలో హాజరు పట్టికను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

రసూల్‌పురా: పట్టణ ఆరోగ్య కేంద్రం, బస్తీ దవాఖానాల్లో విధులు నిర్వహిస్తున్న కొందరు వైద్యులు, సిబ్బంది ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్ నిర్వాహకులతో కుమ్మక్కై ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారిని సస్పెండ్ చేయిస్తానని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ హెచ్చరించారు. రసూల్‌పురా పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపిహెచ్‌సీ), సీబీఎస్ నగర్‌లోని బస్తీ దవాఖానాలను ఎమ్మెల్యే సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. యూపీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్ అందుబాటులో లేకపోవడం, కేంద్రం తలుపులు మూసి ఉండడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హాజరు పట్టికను పరిశీ లించారు. అనంతరం బస్తీ దవాఖానను తనిఖీ చేయగా వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండడం లేదని పలువురు రోగులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. బస్తీ దవాఖాన లో సైతం హాజరు పట్టికను పరిశీలించి బయోమెట్రిక్ మిషన్ లేదా అని సిబ్బందిని ప్రశ్నించారు. వైద్యులు, సిబ్బంది సమయానికి రాకుండా విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సందడిగా క్రికెట్, కబడ్డీ



విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న నిర్వాహకులు

సనత్‌నగర్: కుందూరు రంజిత్‌గౌడ్ స్మారక క్రికెట్,కబడ్డీ పోటీలు సనత్‌నగర్‌లోని జీహెచ్‌ఎంసీ క్రీడా మైదానంలో ఉత్సాహంగా జరిగాయి. బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గోవింద్ రాథోడ్, మహంకాళి-సికింద్రాబాద్ జిల్లా గిరిజన మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సోమ్లు సాయిరాథోడ్ బృందం ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. జూనియర్ కళాశాలల నుంచి క్రికెట్‌లో 70 జట్లు, కబడ్డీలో 30 జట్లు హాజరయ్యాయి. 9 ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాల క్రికెట్‌లో విజేతగా నిలవగా, శ్రీఆద్య జూనియర్ కళాశాల రన్నరప్‌గా నిలిచింది. కబడ్డీలో శ్రీచైతన్య మొదటి స్థానంలో నిలవగా, అక్షర జూనియర్ కళాశాల రన్నరప్‌గా నిలిచింది.

ఓపెన్‌జిమ్‌ను అందుబాటులోకి తేవాలి



మార్కండేయనగర్ పార్కులో ఓపెన్ జిమ్

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్ ఫ్రైడే మార్కెట్ సమీపంలోని మార్కండేయ నగర్ పార్కులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను అందుబాటులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు. లక్షలాది రూపాయల వ్యయంతో నెలరోజుల క్రితం ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేయగా నేటికీ ప్రారంభించకపోవడం గమనార్హం. తక్షణమే పార్కులో వసతులు కల్పించి ఓపెన్ జిమ్‌ను అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై స్థానిక కార్పొరేటర్ సామల హేమ మాట్లాడుతు అధికారులతో చర్చించి పార్కులో వసతుల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని, వారం రోజుల్లో ఓపెన్ జిమ్‌ను ప్రజలకు అందుబాటులోకి తెస్తామని స్పష్టం చేశారు.


ఉత్సాహంగా వెయిట్ లిఫ్టింగ్ పోటీలు



వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో మొదటి స్థానం సాధించిన రేవంత్

సికింద్రాబాద్: తెలంగాణ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-17, అండర్-19 వెయిట్ లిఫ్టింగ్ పోటీలు జింఖానా గ్రౌండ్‌లో నిర్వహించారు. పలు పాఠశాలల నుండి సుమారు 175 మంది యువక్రీడాకారులు పాల్గొన్నారు. సికింద్రాబాద్ సీతాఫల్‌మండి శ్రీవిద్యా వికాస్ కాలేజ్‌లో ఇంటర్ సెంకడ్ ఇయర్‌కు చెందిన జీఎం. రేవంత్ అండర్ -17 విభాగంలో మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ తెలంగాణ కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అధికారులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలతా శోభన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎన్. రామ్‌చందర్‌రావు

లాలాపేట: తార్నాక ఫోరం ఫర్ సీనియర్ సిటిజెన్స్, సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ ఫర్ స్పోర్ట్స్, గేమ్స్, నాగార్జున నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన 3వ టోర్నమెంట్ పోటీలు ముగిసాయి. మూడు రోజుల పాటు కొనసాగిన ఈ టోర్నమెంట్‌లో క్యారెమ్స్, చెస్, టేబుల్ టెన్నిస్, బాల్ బ్యాడ్మింటన్, బ్రిడ్జి తదితర క్రీడా పోటీల్లో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 150 మంది 61 ఏళ్లు దాటిన సీనియర్ సిటిజెన్స్ పాల్గొని క్రీడా స్ఫూర్తిని చాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమానికి డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎన్. రామ్‌చందర్‌రావులు హాజరై విజేతలైన వారికి బహుమతులు అందజేశారు.

కాంగ్రెస్ సేవాదళ్ ఉపాధ్యక్షురాలిగా రామలీల

అడ్డగుట్ట: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ సికింద్రాబాద్ ఉపాధ్యక్షురాలిగా అడ్డగుట్టకు చెందిన రామలీల నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం తెలంగాణ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు మిద్దెల జితేందర్ చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో ఇంచార్జ్ పి. సంగీత పాల్గొన్నారు.

సర్వే ఓ వైపు.. విధులు మరోవైపు..

ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించారు

- ఇక రోజు వారీ విధుల్లో సిబ్బంది
- ట్యాక్స్ వసూళ్లపై ప్రత్యేక శ్రద్ధ..
- డిసెంబర్ 24 వరకు కొత్తగా ఓటరు నమోదుకు దరఖాస్తుల స్వీకరణ
- త్వరలో నిరుపయోగ వస్తువుల సేకరణకు ప్రత్యేక డ్రైవ్..
- 'సాక్షి' ఇంటర్వ్యూలో బేగంపేట సర్కిల్ ఉప కమిషనర్ సమ్మయ్య



బేగంపేట సర్కిల్ ఉప కమిషనర్ సమ్మయ్య

సనత్‌నగర్: సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణన సర్వే తుది దశకు చేరుకుందని, ప్రజల సహకారంతో సమగ్ర కుటుంబ సర్వేను విజయవంతంగా పూర్తి చేస్తామని జీహెచ్‌ఎంసీ బేగంపేట సర్కిల్ ఉప కమిషనర్ సమ్మయ్య స్పష్టం చేశారు. ఒకవైపు సమగ్ర కుటుంబ సర్వేను కొనసాగిస్తూనే మరో వైపు రోజువారీ విధులను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులకు కలగకుండా చూసిన మున్సిపల్ సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు. అలాగే సర్వే లక్ష్యాలను పూర్తి చేసిన బీఎల్‌ఓలు ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాల్లో కూడా ప్రజలకు అందుబాటులో ఉండి కొత్తగా ఓటు నమోదుకు ఫారం-6 దరఖాస్తులతో పాటు మార్పులు చేర్పులు, సవరణలకు సంబంధించి దరఖాస్తులను నేరుగా స్వీకరించినట్లు వివరించారు. సర్వే జరిగిన తీరు, రోజువారీ మున్సిపల్ కార్యకలాపాలు, శానిటేషన్, ఓటరు నమోదు ఇతరత్రా కార్యకలాపాల నిర్వహణ తీరుపై బేగంపేట సర్కిల్ ఉప కమిషనర్ (డీసీ) సమ్మయ్యతో 'సాక్షి' ఇంటర్వ్యూ...

- సర్కిల్‌ను 455 బ్లాక్‌లుగా విభజించి ఎన్యుమరేటర్లను నియమించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా సర్వే చేపట్టాం. సర్వే దాదాపుగా పూర్తి కావస్తోంది. సర్కిల్ పరిధిలో 23 శాతం వరకు కమర్షియల్ భవనాలు ఉండడం, ఇందులో కార్యకలాపాలు కొనసాగించేవారంతా బయట ఉండడంతో వారి వివరాలు మినహాయించి సర్కిల్ పరిధిలో ఉండే వారి ఇళ్ల సర్వే తుది దశకు చేరుకుంది. 1000-1500 ఇళ్లు మాత్రమే ఉన్నాయి. మంగళవారం నాటికి పూర్తి కావచ్చు.
- ప్రారంభంలో కొంతమంది సర్వే దేనికో అని ఆందోళన చెందారు. ఆ తర్వాత సర్వే ఉద్దేశ్యం గురించి తెలుసుకుని అందరూ సహకరించి ప్రభుత్వం సూచించిన వివరాలను అందజేశారు.
- ఆదయ్యనగర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో డీఈఈ స్థాయి అధికారి పర్యవేక్షణలో ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను చేపట్టాం. అక్కడే స్ట్రాంగ్ రూమ్ కూడా ఏర్పాటుచేసి దరఖాస్తులను భద్రపరచాం. ఆన్‌లైన్ నమోదుకు డేటా ఎంట్రీ ఆపరేటర్లను కూడా తీసుకున్నాం. నిరంతరం పర్యవేక్షించేందుకు సీసీ టీవీలను కూడా ఏర్పాటుచేస్తున్నాం.
- సర్వేలో కొంతమంది ట్యాక్స్ విభాగానికి చెందిన సిబ్బంది కూడా పాల్గొన్నారు. అయితే ప్రభుత్వం చేపట్టిన సర్వే ప్రాధాన్యత సంతరించుకున్నందున ముందుగా దీనిని పూర్తిచేయాలనే లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈ సర్వే కూడా పూర్తి కావస్తున్నందున ఇప్పటికే లక్ష్యాన్ని పూర్తి చేసిన సిబ్బంది రెవెన్యూపరమైన అంశాలపై దృష్టిసారించారు.
- ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బీఎల్‌ఓలు 23, 24 తేదీలతో పాటు అంతకుముందు 16, 17 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను నిర్వహించాల్సి వచ్చింది. అయితే కొంతమంది బీఎల్‌ఓలు కూడా సర్వేలో పాల్గొనాల్సి వచ్చింది. బీఎల్‌ఓలు సర్వేలో పాల్గొంటూ తమ లక్ష్యాన్ని పూర్తి చేసుకుంటూ ఓటరు నమోదు కేంద్రాల్లో అందుబాటులో ఉండి ప్రజల నుంచి దరఖాస్తును స్వీకరించారు.
- చాలామంది తమ ఇళ్లల్లో నిరుపయోగంగా ఉన్న దిండ్లు, పరుపులు, కుర్చీలు, బెంచీలు.. ఇలా ఎన్నో రకాల వస్తువులు ఎక్కడపడితే అక్కడ పడేయడం వల్ల వరదనీటి నాలాల్లోకి చేరి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అలాకాకుండా జీహెచ్‌ఎంసీ స్పెషల్ డ్రైవ్ ద్వారా నేరుగా వాటిని సేకరించే ప్రక్రియ జరుగుతుంది. త్వరలోనే బేగంపేట సర్కిల్‌లో కూడా ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తాం.
- ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్నాం. ఆయా విభాగం అధికారులు ఆ ఫిర్యాదుకు సంబంధించి విచారణ చేసి తదనుగుణంగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. ఒక్క ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులే కాకుండా ఎప్పుడైనా ఫిర్యాదు అందితే సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాంగోపాల్‌పేట్: మోండా సబ్ స్టేషన్ పరిధిలోని ఫీడర్ల మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ప్యారడైజ్ సీబీడీ ఏడీఈ ఆదినారాయణ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ధర్మకాంట ఫీడర్ పరిధిలోని మానస నర్సింగ్ హోం, టెలిఫోన్ భవన్, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు గాంధీనగర్ ఫీడర్ పరిధిలోని గాంధీనగర్ పోలీస్ స్టేషన్, బోయిగూడ గార్డెన్, సున్నంబట్టి, రైల్వే క్వార్టర్స్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

సనత్‌నగర్: గ్రీన్‌ల్యాండ్స్, ఆల్విన్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వెంకట్ ప్లాజా, ఒర్రా జ్యువెలర్స్, కృష్ణా జ్యువెలర్స్, ఎక్సైడ్ బ్యాటరీ లేన్, పోచమ్మబస్తీ, పంజగుట్ట, సౌభాగ్యనగర్, ఎస్ఆర్‌టీ క్వార్టర్స్, కైలాష్‌నగర్, సుభాష్‌నగర్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వీబీపీ షోరూం, నీరజ్ పబ్లిక్ స్కూల్ ల్యాండ్, లాల్‌బంగ్లా, రాధా సూపర్ మార్కెట్ ల్యాండ్, ఎర్రగడ్డ మెయిన్‌రోడ్డు, ఎఫ్‌సీఐ గోడౌన్ ఏరియా ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

ఓయూకు గ్రూప్-4 ఉద్యోగులు

కాంట్రాక్టు ఉద్యోగుల్లో నిరాశ

ఉస్మానియా యూనివర్సిటీ: గ్రూప్-4కు ఎంపికై న ఉద్యోగులలో 375 మంది ఓయూకు రానున్నారు. యూనివర్సిటీ చరిత్రలో నాన్‌టీచింగ్ ఉద్యోగులను తొలిసారి గ్రూప్-4 ఎంపికైన ఉద్యోగులతో భర్తీ చేస్తున్నారు. ఇదివరకు నాన్‌టీచింగ్ ఉద్యోగాలను ఓయూ అధికారులు నియమించారు. కానీ తెలంగాణ ఏర్పడిన తర్వత రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల నియామకాల నిబంధనలు మార్చింది. దీంతో గత 26 సంవత్సరాలుగా ఓయూలో కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న ఉద్యోగులు నిరాశ చెందుతున్నారు. గ్రూప్-4 ఉద్యోగుల రాకతో తమను ఉద్యోగాల నుంచి తొలగిస్తారేమోనన్న గుబులు కాంట్రాక్టు ఉద్యోగుల్లో కొత్తగా మొదలైంది. కొత్తగా వీసీ ప్రొ.కుమార్ ఓయూ కాంట్రాక్టు ఉద్యోగాలను పర్మనెంట్ చేయాలని కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో గుర్తుతెలియని వ్యక్తి మృతి



సనత్‌నగర్: కరెంటు షాక్‌కు గురై ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బేగంపేట ఎస్ఐ వరలక్ష్మీ తెలిపిన మేరకు.. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ప్రాంతంలో కరెంటు బ్రేక్ డౌన్ అయ్యిందని బేగంపేట సబ్‌స్టేషన్ ఆపరేటర్ సమాచారం అందించారు. దీంతో ఏఈ త్రిమూర్తులు ఆ ప్రాంతానికి చేరుకుని కరెంటు బ్రేక్‌డౌన్ అవడానికి గల కారణాలపై అన్వేషణ మొదలు పెట్టారు. ఈ క్రమంలో బేగంపేట ఉమెన్స్ డిగ్రీ కళాశాల బస్టాపు వెనుక వైపు పరిశీలించగా ఆర్ఎంయూ (రింగ్ మెయిన్ యూనిట్) 11కే ఓల్ట్స్ బాక్స్ ఓపెన్ చేసి ఉండడాన్ని గమనించారు. దాని సమీపంలోనే సుమారు 25-30 సంవత్సరాల వయస్సున్న ఓ వ్యక్తి తీవ్ర గాయాలతో పడి ఉన్నాడు. అతన్ని పరిశీలించగా కరెంటు షాక్‌కు గురై చనిపోయినట్లుగా గుర్తించారు. ఆర్ఎంయూ బాక్స్‌లోని వైర్లను తాకి ఉండవచ్చని, దీంతో షాక్‌కు గురై మృతి చెంది ఉంటాడని పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షులు బూర్గుపల్లి కృష్ణాయాదవ్

పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలి

ముషీరాబాద్: సీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి చట్టసభల్లో బీసీలకు దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుపల్లి కృష్ణాయాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఎన్నికల ప్రచారంలో బీసీల ఓట్లే లక్ష్యంగా ప్రచారం చేసుకున్న ప్రధాని మోదీ జనాభా లెక్కల్లో బీసీ కులగణన చేపడతానని ఇచ్చిన హామీని విస్మరించారని విమర్శించారు. అలాగే కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, జనవరి నుంచి ప్రారంభం అయ్యే దేశ జనాభా గణనలో బీసీల కులాల గణన చేపట్టాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో క్రిమిలేయర్ విధానాన్ని ఎత్తి వేయాలన్నారు. బీసీ అట్రాసిటీ చట్టం ఏర్పాటు చేసి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి సంకల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం సహకరించాలన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల అమలును దేశవ్యాప్తంగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు గొరిగే మల్లేష్‌యాదవ్, నిఖిల్, వెంకటరాములు పాల్గొన్నారు.

వీధిదీపాలకు మరమ్మతులు



సనత్‌నగర్: రాంగోపాల్‌పేట డివిజన్ చుట్టలబస్తీలో వీధి దీపాల సమస్యను అధికారులు సోమవారం పరిష్కరించారు. స్థానికంగా వీధి దీపాలు వెలగక అంధకారం నెలకొని ఇబ్బందులు పడుతున్నామని స్థానికులతో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు ఆ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమ దృష్టికి తీసుకువచ్చారు. ఈ మేరకు ఆమె విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి సమస్యను వారికి వివరించి పరిష్కరించాలని కోరారు. దీనికి స్పందించిన విద్యుత్ సిబ్బంది వీధి దీపాలకు మరమ్మతులు చేసి వెలుగులు కురిపించారు.


కృతజ్ఞత సభ కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మధుయాష్కీగౌడ్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో వచ్చే నెల 21న నిర్వహించనున్న కృతజ్ఞత సభ కరపత్రాన్ని కాంగ్రెస్ నేతలు ఆవిష్కరించారు. సోమవారం మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ విడుదల చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని నిరుద్యోగ జేఏసీ చైర్మన్ కోటూరి మానవత రాయ్ తెలిపారు. కార్యక్రమంలో చామకూరి శ్రీధర్ గౌడ్, బైరు నాగరాజుగౌడ్, పట్ల నాగరాజు, నగేష్, మణికంఠనాయుడు, పొన్న రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మాలల సింహ గర్జన కరపత్రం ఆవిష్కరణ



లాలాపేట: మాలమహానాడు ఆధ్వర్యంలో డిసెంబర్ 1న నిర్వహించనున్న మాలల సింహగర్జన కరపత్రాన్ని సోమవారం తార్నాకలోని చింతల్ బస్తీలో మాల మహానాడు నాయకులు ఆవిష్కరించారు. సంఘం రాష్ట్ర నాయకులు బండి మహేశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ డిసెంబర్ 1న పరేడ్ గ్రౌండ్‌లో జగిగే ఈ సభకు భారీ సంఖ్యలో మాలలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



ఠాణాల్లో పెండింగ్ కేసులపై..

ప్రజావాణిలో ఫిర్యాదులు



బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్..

బంజారాహిల్స్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా గత ఏడాది డిసెంబర్‌లో ప్రజాభవన్‌లో ప్రతి మంగళ, శుక్రవారాల్లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుంటూ దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. జీహెచ్‌ఎంసీ, రెవెన్యూ, హెచ్‌ఎండీఏ, సబ్ రిజిస్టర్, పన్నుల విభాగం, ఆస్పత్రుల్లో బిల్లులు ఇలా పలు అంశాలపై దరఖాస్తులు అందజేస్తున్న ప్రజలు పోలీస్‌స్టేషన్‌లో తాము పిటిషన్లు ఇచ్చినా న్యాయం జరగడం లేదంటూ ప్రజావాణి మెట్లెక్కుతున్నారు. సుమారు ఏడాది కాలంగా వెస్ట్‌జోన్ పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, మాసబ్‌ట్యాంక్, పంజగుట్ట, మధురానగర్, బోరబండ, ఎస్సార్‌నగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో న్యాయం చేయాలంటూ ప్రజావాణిలో 144 దరఖాస్తులు అందాయి. ఇందులో బంజారాహిల్స్ ఏసీపీ పరిధిలో 24, జూబ్లీహిల్స్, ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 11, పంజగుట్ట, మధురానగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 6, ఎస్సార్‌నగర్, బోరబండ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 19 చొప్పున దరఖాస్తులు అందాయి. మొత్తం 144 ఫిర్యాదుల్లో 61 కేసులను ఆయా ఠాణాల అధికారులు పరిష్కరించారు. మరో 83 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.

- గత ఏడాది తన భర్త రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా పంజగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ప్రమాదంపై సీసీ కెమెరా ఫుటేజీ కూడా ఉంది. మేము బీదవాళ్లం..మాకు న్యాయం చేయాలంటూ ఓ మహిళ ప్రజావాణిలో ఫిర్యాదు చేసింది.
- బంజారాహిల్స్ రోడ్డునెంబర్-1లోని ఐరిష్ కన్సల్టెన్సీ సర్వీస్‌లో విదేశాల్లో ఉద్యోగాల కోసం తాను రూ.84 లక్షలు చెల్లించడం జరిగింది. వీసాలు క్యాన్సిల్ అయ్యాయని ఇంతవరకు తమకు బంజారాహిల్స్ పోలీసుల నుంచి న్యాయం జరగడం లేదంటూ ఓ యువకుడు ప్రజావాణిలో ఫిర్యాదులో చేశాడు.
- తాను ఓ ఖాళీ స్థలంలో రాక్ కటింగ్ చేశానని, తనకు రూ.11.78 లక్షలు రావాల్సి ఉందని, ఇంత వరకు యజమాని తనకు డబ్బులు ఇవ్వడం లేదని మరో వ్యక్తి ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు.
- తన ఇంట్లో దొంగలు పడి బంగారు, వెండి ఆభరణాలు, పాస్ బుక్‌లు, నంది అవార్డులు, ఇతర జ్ఞాపికలు చోరీ చేశారని, ఇంత వరకు నిందితుడిని పట్టుకోలేకపోయారని ఫిలింనగర్ పోలీసుల వైఫల్యాన్ని ఎత్తిచూపుతూ ఓ మహిళా సినీ అసోసియేట్ డైరెక్టర్ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.
- బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని ఎన్‌బీటీనగర్‌లో నివసించే తనకు 2015 నుంచి కిరాయిదారు ఇంటి అద్దె చెల్లించడం లేదంటూ ఓ మహిళ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.
- ఎస్సార్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాపునగర్‌లో పోలీసు పెట్రోలింగ్ పెంచాలంటూ స్థానికుడు ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు.
- తమ సోదరులు బంజారాహిల్స్‌లోని 400 గజాల ప్లాట్‌కు సంబంధించి తనకు వాటా ఇవ్వడం లేదంటూ ఓ మహిళ ప్రజావాణి మెట్లెక్కారు.
- ఇచ్చిన దరఖాస్తుల్లో 21 ఫిర్యాదులు 2, 3 సార్లు అందజేయడం జరిగింది.
- ఆయా డివిజన్ల ఏసీపీలు ప్రజావాణిలో తమకు వచ్చిన దరఖాస్తులను పరిష్కరించిన వివరాలను కమిషనర్ కార్యాలయానికి రిపోర్ట్ అందజేశారు.
- 11 పిటిషన్లు రెండుసార్లు వచ్చినట్లుగా కూడా కమిషనర్ కార్యాలయానికి రిపోర్ట్ కూడా అందజేశారు.
- వెస్ట్‌జోన్ పరిధిలో బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధి నుంచే అత్యధికంగా 24 మంది ప్రజావాణిని ఆశ్రయించారు.
- అలాగే కొంతమంది సివిల్ వివాదాలు కూడా పోలీసులు పరిష్కరించడం లేదంటూ ప్రజావాణిలో ఫిర్యాదులు చేస్తుండగా ఈ సివిల్ కేసులను పోలీసులు కొట్టేస్తున్నారు. న్యాయస్థానాలను ఆశ్రయించాల్సిందిగా సూచిస్తున్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

లాలాపేట: పవిత్ర కార్తీక మాసం ఆఖరి సోమవారం సందర్భంగా మాణికేశ్వర్‌నగర్‌లోని ఏడుగుళ్ల దేవాలయం శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు శివకుమార్ నేతృత్వంలో శివ లింగాన్ని పూలతో, రుద్రాక్షలతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. శివనామ స్తోత్రాలతో ఆలయం మార్మోగింది.



శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు



మల్లికార్జునుడిని ఎండుఫలాలతో అలంకరించిన దృశ్యం..

సనత్‌నగర్: కార్తీక మాసం ఆఖరి సోమవారం సందర్భంగా శైవక్షేత్రాలు భక్తులతో కిక్కిరిశాయి. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు జరిగాయి. సనత్‌నగర్ శ్రీహనుమాన్ దేవాలయ ప్రాంగణంలోని శివాలయంలో స్వామివారిని వివిధ రకాల ఎండుఫలాలతో అలంకరించిన తీరు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈఓ సత్యనారాయణ పర్యవేక్షణలో అర్చకులు రిపుంజయశర్మ ఆధ్వర్యంలో విశేష పూజా కార్యక్రమాలు కొనసాగాయి.

- బేగంపేట అల్లంతోటబావిలోని శివాలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో తెల్లవారు జాము నుంచి పూజా కార్యక్రమాలు వైభవంగా కొనసాగాయి.



బేగంపేట అల్లంతోటబావిలో స్వామివారికి అభిషేకం

విద్యార్థిని అదృశ్యం.. కాచిగూడలో ప్రత్యక్షం

లాలాపేట: ప్రిన్సిపాల్ మందలించడంతో ఓ విద్యార్థిని మనస్తాపానికి గురై కళాశాల నుంచి చెప్పకుండా వెళ్లిపోయింది.దీంతో అప్రమత్తమైన పోలీసులు బాలికను కాచిగూడలో కనుగొన్నారు. వివరాలు.. మౌలాలీ ఎస్పీ నగర్ ప్రాంతానికి చెందిన ఓ విద్యార్థిని తార్నాకలోని డేవిడ్ మెమోరియల్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. సోమవారం క్లాస్‌రూమ్‌లో కనిపించకపోవడంతో ప్రిన్సిపాల్ మందలించారు. దీంతో మనస్తాపం చెందిన విద్యార్థిని మధ్యాహ్నం 3 గంటలకు చెప్పకుండా వెళ్లిపోయింది. తండ్రికి ఫోన్ చేసి..సారీ డాడీ అంటూ ఫోన్ పెట్టేసింది. దీంతో తల్లిదండ్రులు ఓయూ పోలీసులకు ఫిర్యాదు చేయగా సీసీ కెమెరాల ఆధారంగా బాలిక ఆచూకీ కనుగొన్నారు. కాచిగూడలో గుర్తించి తల్లిదండ్రులకు అప్పజెప్పారు.